సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కోలా గురువులుకు అభినందనలు



డీసీసీబీ చైర్మన్ కోలా గురువులును సన్మానిస్తున్న పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు

మహారాణిపేట : మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులును పలువురు పార్టీ నాయకులు అభినందించారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు ఫాతిమా రాణి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణానందశర్మ, ఫారెస్టు డైరెక్టర్ పీతల వాసు తదితరులు కోలా గురువులును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న రంధి గోపీకృష్ణ

అల్లిపురం : పిల్లల చదువుపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ సూచించారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం అధ్యక్షతన జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. బైజూస్ కంటెంట్, ఐఎఫ్‌పీ బోర్డులు వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం పేదల చదువు కోసం వేల కోట్లు ఖర్చు పెడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు, గంజాయి, సెల్‌ఫోన్లు

అల్లిపురం : గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సె.త్రినాథరావు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్‌బీసీ బిల్డింగ్ దగ్గర సెంట్రల్ పార్క్ పార్కింగ్ స్థలంలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి దర్యాప్తు చేపడుతున్నారు.

మృతుని కుటుంబానికి సీతంరాజు చేయూత



నిత్యావసర సరకులు, ఆర్థిక సాయం అందజేస్తున్న సీతంరాజు సుధాకర్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 37వ వార్డులో నివాసముంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మంగళగిరి రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్ గురువారం రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. 9 రకాల నిత్యావసర సరకులతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గ ప్రజలకి ఎటువంటి కష్టం వచ్చినా తానున్నానని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, ఉరుకుటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

స్వాతంత్య్రానికి పూర్వం నిర్మించిన పూర్ణామార్కెట్‌కు ఎంతో చరిత్ర ఉంది. విశాఖతోనే కాకుండా పలు జిల్లాలతో ఈ మార్కెట్‌కు అనుబంధం ఉంది. వివిధ శుభకార్యాలకు విశాఖ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా వినియోగదారులు పూర్ణామార్కెట్‌కు వచ్చి టోకున సామగ్రి కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. అలాంటి పూర్ణామార్కెట్ సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంది. మార్కెట్‌లోని షాపులు, రోడ్లు శిథిలమై వ్యాపారులు, వినియోగదారులు ఇక్కట్లు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పూర్ణామార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకుంది. అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేయటంతో ఇప్పుడు పూర్ణామార్కెట్ మళ్లీ వ్యాపారులు, వినియోగదారులతో కళకళలాడుతోంది.

సం‘పూర్ణ’మార్కెట్

- నూతన దుకాణాలు, రోడ్లు, తాగునీటి సౌకర్యంతో కొత్త వెలుగులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న వ్యాపారులు



పూర్ణామార్కెట్‌ను ఆనుకుని కొత్తగా నిర్మించిన సీసీరోడ్డు



కొత్తగా కట్టిన దుకాణాల్లో వ్యాపారాలు చేసుకుంటున్న షాపుల యజమానులు

జగదాంబ : వందేళ్ల పూర్ణామార్కెట్ కొత్త వెలుగులు సంతరించుకుంటోంది. విశాఖతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, పాడేరు, మన్యం వంటి అన్ని ప్రాంతాల నుంచి ఇక్కడికి వినియోగదారులు వస్తుంటారు. ఎన్ని రైతుబజార్లు ఉన్నా నగరానికే తలమానికమైన పూర్ణామార్కెట్‌కు ఉండే గొప్పదనమే వేరు. ఈ మార్కెట్‌ను గత ప్రభుత్వాలు కనీసం పట్టించుకోలేదు. ఫలితంగా ఎంతో చరిత్ర ఉన్న పూర్ణామార్కెట్ శిథిల దశకు చేరుకుంది. ఇక్కడి వ్యాపారులు సరైన వసతులు లేక ఇబ్బందిపడేవారు. ఫుట్‌పాత్‌లు, తాగునీరు వంటి వసతులు లేక వ్యాపారులు, వినియోగదారులు ఇక్కట్లకు గురయ్యేవారు. ఎన్నికల సమయంలో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పి ఆ తర్వాత మర్చిపోయేవారు గత పాలకులు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ. 30 లక్షలకు పైగా వెచ్చించి పూర్ణామార్కెట్‌కు కొత్త హంగులు ఏర్పాటు చేశారు. ఎ, బి, సి, డి కేటగిరీల కింద సుమారు 1500 దుకాణాలున్న పూర్ణామార్కెట్‌ను అభివృద్ధి చేశారు. శిథిలమైన వాటి స్థానంలో కొత్త దుకాణాలు నిర్మించారు. పెయింటింగ్‌లు, ఫుట్‌పాత్‌లు, మార్కెట్ చుట్టుపక్కల రహదారులు, సీసీరోడ్లు నిర్మించి వ్యాపారులు, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. కార్పొరేటర్ నిధులతో మరింత అభివృద్ధి జరగడంతో పూర్ణామార్కెట్‌కు కొత్త కళ వచ్చింది.

సీసీ రోడ్డుతో ఇబ్బందులు తొలగాయి..



పూర్ణామార్కెట్‌కు ఆనుకుని ఉన్న అరటిపండ్ల సందులో సీసీ రోడ్డు శిథిలమై నానా యాతన పడేవాళ్లం. ఒకపక్క యూజీడీ, మరోపక్క వర్షం నీటితో మార్కెట్‌లో మసిలేందుకు కూడా వీలు కాని పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు రోడ్డు నిర్మించటంతో ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నాం.

– సత్యనారాయణ, పూర్ణామార్కెట్ వ్యాపారి.

మార్కెట్ కళకళలాడుతోంది..



మార్కెట్‌కు కొత్త హంగులు ఏర్పాటు చేసిన తర్వాత వినియోగదారుల సంఖ్య పెరిగింది. గతంలో విద్యుత్ వైర్లు వేలాడుతూ ఉండటంతో కనీసం లోపలికి రావడానికి కూడా కొనుగోలుదారులు ఆసక్తి చూపేవారు కాదు. మహిళలు భయపడేవారు. ఇప్పుడు ఆ సమస్య లేదు. అందరు వస్తున్నారు. సక్రమంగా మా వ్యాపారాలు సాగుతున్నాయి.

– గోవింద్, పూర్ణామార్కెట్ వ్యాపారి.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం



మార్కెట్‌లో అన్ని పార్టీల వాళ్లు ఉన్నా గతంలో ఏ ప్రభుత్వం ఏమీ చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్ణామార్కెట్ అభివృద్ధికి ఎంతో కృషి జరిగింది. రూ.30 లక్షలకు పైగా కార్పొరేటర్ నిధులతో మార్కెట్‌కు అవసరమైన పనులు పూర్తి చేశాం. ఈ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది.

–విల్లూరి భాస్కరరావు, 35వ వార్డు కార్పొరేటర్.

నులిపురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం



ఎంజీఎం హైస్కూల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఉపాధ్యాయులు, రంధి గోపి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాత్రలు మింగిస్తున్న ఆశ వర్కర్, అంగన్‌వాడీ కార్యకర్త

అల్లిపురం : నులిపురుగుల నివారణతో పిల్లల ఆరోగ్యానికి రక్షణ లభిస్తుందని, రక్తహీనత సమస్యలు తొలగిపోతాయని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం వార్డులో మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్, మోడల్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ల సమక్షంలో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు ఈ మాత్రలు వేయడం ద్వారా బంగారు భవిష్యత్తు అందించవచ్చన్నారు. ఎంజీఎం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగభూషణం మాట్లాడుతూ పిల్లలు నులి పురుగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్యకరమైన భోజనం తీసుకోవడం, కలుషిత నీరు తాగడం, శరీరాన్ని సరిగ్గా శుభ్రపరచుకోకపోవటం, అపరిశుభ్ర పరిస్థితులు, సగం ఉడికిన మాంసం తినడం, మట్టి, మురికి పరిసరాలలో ఆటలాడటం వలన నులిపురుగులు వచ్చే అవకాశం ఉందని వివరించారు. నులిపురుగులు గల పిల్లల్లో పిరుదులపై చికాకు, దురద, కడుపులో స్థిరమైన నొప్పి, వికారం, వాంతులు, మలబద్ధకం, బరువు తగ్గటం, ఆకలి మందగించడం, బలహీనత, అలసట, తరచుగా మూత్ర విసర్జన, రక్తహీనత, మూత్ర విసర్జన చేసేటప్పుడు మండుతున్న అనుభూతి కలుగుతుందన్నారు. వాటిని నివారించేందుకు పిల్లలు తినడానికి ముందు, బయట ఆడుకున్న తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. మరిగించిన నీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

17 నుంచి కన్యకాపరమేశ్వరికి శ్రావణం పూజలు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్ తదితరులు

దాబాగార్డెన్స్ : నగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 17 నుంచి వచ్చే నెల 15 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆరిశెట్టి దినకర్, గ్రంథి రామకృష్ణారావు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో పలువురు ప్రముఖులచే ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాల్లో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రాతఃకాల ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, మహిళలచే వివిధ అమ్మవార్ల స్తోత్ర పారాయణ, సామూహిక శ్రీచక్ర సహిత కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. తొలి శుక్రవారం అమ్మవారికి పట్టు వస్త్రాలంకరణ, సామూహిక లలితా సహస్రనామ పారాయణ, 108 గోత్ర రుషి పూజలు ఉంటాయన్నారు. రెండో శుక్రవారం సువర్ణ వస్త్రాలంకరణ, నవ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు, మూడో శుక్రవారం ముత్యాల చీర అలంకరణ, నవ పుష్పాల పూజ, నాల్గవ శుక్రవారం రజిత వస్త్రాలంకరణ, 108 ద్రవ్యాలతో అమ్మవారి మూల విరాట్‌కు సహస్ర ఘటాభిషేకం, సామూహిక కుంకుమ పూజలు, ఐదో శుక్రవారం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్, ఆలయ కోశాధికారి సుగ్గు శివకుమార్, ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు వేదా కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు నైపుణ్యమే కొలమానం



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఏవీఎన్ కళాశాల కరస్పాండెంట్ భానోజీరావు

దాబాగార్డెన్స్ : నైపుణ్యమే ప్రతిభకు కొలమానమని, మెలకువలు తెలుసుకున్నప్పుడే క్రీడాకారులుగా రాణించగలరని ఏవీఎన్ కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు పేర్కొన్నారు. కళాశాల పూర్వ కరస్పాండెంట్ ఇంద్రాణి జగ్గారావు మెమోరియల్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భానోజీరావు మాట్లాడుతూ ప్రతి ఏటా ఇంద్రాణి పేరిట క్రీడా పోటీలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఇంద్రాణి జగ్గారావు సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం ఉన్న కళాశాలల్లో ఏవీఎన్ కళాశాల ఒకటని, కరస్పాండెంట్లుగా బాధ్యతలు నిర్వహించిన వారు ఎన్నో సమాజహిత కార్యక్రమాలు చేపట్టారన్నారు. కళాశాల పీడీ గోపీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో నగరంలోని 10 డిగ్రీ కళాశాలలకు చెందిన 24 వాలీబాల్, హ్యాండ్‌బాల్ టీమ్‌లతో పాటు వివిధ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్ విభాగంలో ఏవీఎన్ కళాశాల విజేతగా నిలవగా, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల రన్నరప్‌గా నిలిచింది. త్రోబాల్ బాలికల విభాగంలో కణితి జెడ్పీ హైస్కూల్ విన్నర్‌గా, బాలాజీ హైఫీల్డ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ రన్నరప్‌లో నిలిచింది. త్రోబాల్ బాలుర విభాగంలో కణితి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలవగా, సింహాచలం ఎంజీపీ స్కూల్ రన్నరప్‌గా నిలిచారు. కార్యక్రమంలో కళాశాల డీన్ శంకరనారాయణ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

13న చిత్రలేఖనం పోటీలు

దాబాగార్డెన్స్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ట్ బై ఉషా డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ అకాడమీచే ఈ నెల 13న చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎస్. ఉష ఒక ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. విజేతలకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రం ప్రముఖుల చేతుల మీదుగా అందజేయనున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9848852039 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

సెయింట్ జోసెఫ్‌లో కౌన్సిల్ తనిఖీలు



విద్యార్థులు, అధ్యాపకులతో కౌన్సిల్ సభ్యులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గురువారం ఎక్స్‌టర్నల్ అకడమిక్ ఆడిట్ సభ్యులు, రాష్ట్ర ఉన్నత విద్యా కౌన్సిల్ ప్రతినిధులు తనిఖీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యా కౌన్సిల్ సలహాదారు డాక్టర్ ఎస్.శంకర్, డాక్టర్ జి.రామలక్ష్మి క్యాంపస్‌లో అన్ని విభాగాలను, ప్రయోగశాలలను నిశితంగా పరిశీలించారు. ఐక్యూఏసీ అధ్యాపక సభ్యులు ఉత్తమ అభ్యాసాలను, విద్యార్థులు సాధించిన విజయాలను తెలుసుకుని అవార్డులను పరిశీలించినట్లు డాక్టర్ సిస్టర్ షైజీ ఈ సందర్భంగా తెలియజేశారు.

ఆరిలోవలో ఫిష్‌మార్కెట్ ఏర్పాటుకు వినతి

దాబాగార్డెన్స్ : తూర్పు నియోజకవర్గ పరిధి ఆరిలోవ ప్రాంతంలో ఫిష్ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయతో కలిసి గురువారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ సాయికాంత్‌వర్మ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ఫిష్‌మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామని తెలపారని కోలా గురువులు ఈ సందర్భంగా తెలియజేశారు.

సికింద్రాబాద్‌లో రైలెక్కి.. విశాఖలో అదృశ్యం



రోహన్(ఫైల్)

తాటిచెట్లపాలెం: పాలిటెక్నిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని తండ్రి మందలించడంతో హైదరాబాద్‌కు చెందిన బాలుడు ఇంట్లో చెప్పకుండా విశాఖపట్నం వచ్చేసి.. అదృశ్యమయ్యాడు. విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివీ.. నేరేడ్‌మెట్(హైదరాబాద్)కు చెందిన గోవర్ధన్.. కుమారుడు కె. రోహన్ రాజు(17)ను మందలించడంతో సికింద్రాబాద్‌లో రైలెక్కి ఈ నెల 4న విశాఖపట్నంలో దిగాడు. ఇక్కడ నుంచి వేరే వారి సెల్‌ఫోన్ నుంచి తన ఫ్రెండ్‌కు ఫోన్ చేసి విశాఖ వచ్చినట్లు చెప్పాడు. అతను బాలుడి తండ్రి విషయం చెప్పాడు. వెంటనే రోహన్ కోసం కుటుంబ సభ్యులు గాలించారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో గురువారం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోహన్ ఇంటి నుంచి బయలు దేరినప్పుడు క్రీం కలర్ టీషర్ట్, డార్క్ బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, చామన చాయ రంగు, సన్నగా ఉంటాడని తండ్రి గోవర్ధన్ తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు గవర్నమెంట్ రైల్వేపోలీస్ స్టేషన్‌లో గానీ, సబ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావుకు 98664 13487లో గానీ తెలియజేయవచ్చు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ఫోన్ కాల్స్ ద్వారా వచ్చిన వినతుల మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం నియోజకవర్గంలోని పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. 33వ వార్డు వేంకటేశ్వరమెట్ట ప్రాంతానికి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త, వార్డు మహిళా అధ్యక్షురాలు వెళ్లంకి చిన్నమ్మలు కుమారుడు శ్రీనివాస్ ఇటీవల గుండెనొప్పి కారణంగా మృతి చెందాడు. పెద్ద ఖర్మ ఖర్చులకు తన సొంత నిధుల నుంచి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. అంతేగాక పిల్లల చదువులు నిలిచిపోకుండా స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామని హామీ ఇచ్చారు. 34వ వార్డు భూపేష్‌నగర్‌కు చెందిన పార్టీ కార్యకర్త షేక్‌బాషా కొద్ది నెలలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారని, మందుల ఖర్చులకు నెల రోజుల కిందట రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. షేక్‌బాషా మృతి చెందిన కారణంగా గురువారం సమాధి ఖర్చులకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, జేసీఎస్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, లింగం శ్రీను, లండా రమణ, దూడ అప్పారావు, పాల శ్రీహరిరెడ్డి, ముత్తాబత్తుల రమేష్, బొడ్డేటి ప్రసాద్, బొర్రా శ్రీనివాసరెడ్డి, గోపి, అనురాధ, ఆరుగుల రాజు, చిన్నమ్మలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో రుసుము చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

35వ వార్డులో ఆధార్ అప్‌డేట్ క్యాంప్



అప్‌డేట్ చేసిన ఆధార్ పత్రం అందిస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ : ఆధార్ కార్డులో తప్పులుంటే వెంటనే సరి చేసుకోవాలని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. గురువారం వార్డు కార్యాలయంలో ఆధార్ అప్‌డేట్ మెగా క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. చాలా మంది ఆధార్ కార్డులో పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలో తప్పుల వల్ల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అటువంటి వారు ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పది రోజుల పాటు ఈ క్యాంప్ ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పని చేస్తుందన్నారు. గడువు ముగిసినా ఆధార్‌లో తప్పులు సరి చేసుకోని వారు ఎవరైనా ఉంటే ఫోన్‌లో వారికి అందుబాటులో ఉంటామని విల్లూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే యువత



కార్పొరేటర్ సాధిక్‌ను కలిసిన యువకులు

జగదాంబ : పాతనగరం యువకులు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఉన్నారని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. గురువారం పాతనగరానికి చెందిన యువకులు వార్డు కార్యాలయంలో సాధిక్‌ను కలిసారు. నియోజకవర్గంలో యువకులంతా వైఎస్సార్‌సీపీతోనే ఉన్నట్లు తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తామంతా పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో అందజేస్తున్న సేవలను ప్రతి ఒక్కరు పొందుతున్నారన్నారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఇప్పటికే వలంటీర్లుగా, కార్యదర్శులుగా ఉద్యోగావకాశాలు, వాహనమిత్రతో ఉపాధి కల్పించారని తెలిపారు. అలాగే వైఎస్సార్ ఫిష్ మార్కెట్లు స్థాపించి యువతకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. పార్టీలో యువతకు అన్ని రంగాల్లో చక్కటి అవకాశాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు.

జగనన్న పోషణ కిట్ల పంపిణీ



జగనన్న పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బిషప్ కె.మరియదాస్ కమ్యూనిటీ హాల్లో గురువారం జగనన్న సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ జరిగింది. బాబుకాలనీ, సెబ్బాసియన్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు కిట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రానున్న తరం ఆరోగ్యవంతంగా ఉండాలని ఈ కార్యక్రమం చేపట్టారని ఆమె తెలిపారు. సుమారు 41 మంది గర్భిణులు, బాలింతలకు జగనన్న పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్ వీనీల, కలెక్టర్ ఆఫీస్ కో–ఆర్డినేటర్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వేళంగిణి రావు, కమల్, శ్యామ్‌సుందర్, అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి, ఏఎన్ఎంలు బిందు, సాయికుమారి, సుహాసిని, మహిళా పోలీసులు లావణ్య, ప్రియాంక, కుమారి, నిఖిల, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మెయిన్ లైన్‌లో డీఆర్ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) సౌరభ్ ప్రసాద్ గురువారం డివిజన్ పరిధిలోని మెయిన్ లైన్‌లో గురువారం పర్యటించారు. విశాఖపట్నం–పలాస సెక్షన్ పరిధిలో పూండి నుంచి విశాఖ వరకు విండో ట్రయలింగ్ తనిఖీలు చేపట్టారు. విశాఖ రైల్వేస్టేషన్ నుంచి కొత్తవలస, చీపురుపల్లి, తిలారు, శ్రీకాకుళంరోడ్, నౌపడ వరకు ఈ తనిఖీలు నిర్వహించారు. డీఆర్ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎస్.కె.పాత్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన



స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జగదాంబ : మానసిక ఉల్లాసమే ఆరోగ్యమని స్నేహ సంధ్య ఏజ్‌కేర్ వైద్యాధికారి ఎస్.రాజు అన్నారు. గురువారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సూర్యతేజ మాట్లాడుతూ నిత్యం ఉల్లాసంగా గడపాలన్నారు. ప్రతి నెల రెండవ గురువారం ఈ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, పుండరీకాక్షయ్య, ప్రసాద్‌నాయుడు, సుమతి, అనూష, రత్నం, శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్
7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com